క్లుప్తంగా

కళలను గౌరవించడం సంప్రదాయం



సాయికుమారిని సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: కళలను, కళాకారులను గౌరవించడం భారతీయ సంప్రదాయమని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చేబ్రోలు బాలకృష్ణ గాంధీ అన్నారు. మండలంలోని పెదమామిడిపల్లిలో శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర యువసేన ఆధ్వర్యంలో పాలకొల్లుకి చెందిన ప్రముఖ గాయని, నటి జాడి సాయికుమారిని జ్ఞాపిక, నూతన వస్త్రాలు, శాలువాతో సత్కరించారు. చేబ్రోలు కృష్ణమోహన్, పరిమి నవీన్, ఆలయ చైర్మన్ బండి నెహ్రూ, చేబ్రోలు శ్రీనివాస రామమూర్తి పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

నరసాపురం రూరల్: దేశంలో మరెక్కడా లేని విధంగా ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తూ పేదల పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలిచారని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని చిట్టవరం సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచడం ద్వారా ఎలాంటి అనారోగ్యం వచ్చినా పేదలు కార్పొరేట్ వైద్యం చేయించుకోవచ్చని పేర్కొన్నారు. చిట్టవరం గ్రామంలో 1,345 కార్డులను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, సర్పంచ్ తాడి లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు నక్కా లక్ష్మీనారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షులు కాకిలేటి ఆనందకుమార్, ఆత్మ చైర్మన్ కడలి రాంబాబు, నాయకులు మైలాబత్తుల శ్రీను, చినమిల్లి చందు, కొల్లా శ్రీనివాస్, జక్కంపూడి నాని, చల్లా సత్యనారాయణ, అంతర్వేది నాగేశ్వర రావు, ఏలూరి చంద్రశేఖర్, యడవల్లి కొండ తదితరులు పాల్గొన్నారు.



చిట్టవరంలో ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను పంపిణీ చేస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

పెనుమంట్రలో..

పెనుమంట్ర: వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచుతూ జగనన్న తీసుకున్న నిర్ణయం ప్రజారోగ్యపరిరక్షణపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధి నిదర్శనమని ఎంపీపీ కర్రి వెంకట నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం పెనుమంట్ర సచివాలయంలో సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక అధ్యక్షతన కొత్త ఫీచర్లతో కూడిన ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 1059 వ్యాధులకు మాత్రమే వైద్యసేవలు నేడు జగనన్న ప్రభుత్వం 3257కు పెంచి వైద్య సేవలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు చింతపల్లి మంగాదేవి, సచివాలయ మండల కన్వీనర్ కొవ్వూరి చిన్నారెడ్డి, ఎంపీడీఓ పద్మజ, వైద్యాధికారిణి డాక్టర్ లావణ్య పాల్గొన్నారు.

సీఎం జగనన్నను ఆశీర్వదించాలి

పాలకొల్లు అర్బన్: సంక్షేమ పథకాల ప్రయోజనాన్ని నేరుగా మహిళల ఖాతాల్లో జమచేసి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతీ ఒక్కరూ ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. యలమంచిలి మండలం అబ్బిరాజుపాలెంలోని మెయిన్‌వీధి, నక్కాపాలెం, బండివానిగట్టు ప్రాంతాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ అమలు చేసిన నవరత్నాల పథకాలను వివరించి వారు పొందిన ప్రయోజనాన్ని సూచించి బ్రోచర్‌ను గుడాల గోపి అందజేశారు. మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌ని గెలిపించాలని కోరారు. నవరత్నాల పథకాలకు అర్హులైనవారు ఉంటే వలంటీర్ ద్వారా ఆన్‌లైన్ చేయించుకోవాలని కోరారు. జనవరి నెల నుంచి వైఎస్సార్ పింఛన్ కానుక రూ.3వేలు అందనుందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, అడబాల వెంకట రమణ, సర్పంచ్ కామిశెట్టి సాయిబాబా, ఎంపీటీసీ సభ్యురాలు శిరిగినీడి లక్ష్మీ సునీత, శిరిగినీడి దొరబాబు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గాడి దుర్గాప్రసాద్, శిరిగినీడి ఆంజనేయులు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, జవ్వాది రాధ, తాళ్ల రామకృష్ణ, కొంబత్తుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నకే అవ్వతాతల ఆశీస్సులు

పోడూరు: ప్రతి నెలా 1వ తారీఖున తెల్లవారుజామునే ఇంటికి పింఛన్ సొమ్ము పంపించి తమ జీవితాల్లో సంతోషం నింపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే రాష్ట్రంలోని అవ్వతాతల ఆశీస్సులు మెండుగా ఉన్నాయని పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు అన్నారు. వేడంగిపాలెంలోని విశ్వ మానవవేదిక వృద్ధాశ్రమంలో బుధవారం రాత్రి మల్లుల సురేష్ ఆధ్వర్యంలో ముందస్తుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి నిమిత్తం దుబాయ్‌లో ఉంటున్న పాలకొల్లు మండలం చందపర్రు గ్రామానికి చెందిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభిమాని బొందా కుమార్ ఏర్పాటు చేసిన కేక్‌ను ఇంఛార్జి గోపి కట్ చేసి వృద్ధులకు తినిపించారు. విశ్వమానవ వేదిక అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ పేద వృద్ధుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న జగనన్న జన్మదిన వేడుకను నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ బొండపల్లి గిరిజ, డాక్టర్ మల్లుల జ్ఞానేశ్వరి, అన్నదాన సమాజ సభ్యురాలు శిడగం రమణమ్మ, కుక్కల బసవ రావు తదితరులు పాల్గొన్నారు.



అబ్బిరాజుపాలెంలో మహిళకు నవరత్నాల బ్రోచర్ అందజేస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

సాంకేతిక పరిజ్ఞానంపై ఆసక్తి అవసరం

మొగల్తూరు: సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలని సర్పంచ్ పడవల మేరీ సూచించారు. బుధవారం మొగల్తూరు పెన్మెత్స రంగరాజు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. మండలంలోని పది ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిషన్ పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పీవీ తోట ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనకు ప్రథమ బహుమతి, మొగల్తూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనకు ద్వితీయ బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో ఆకన ఫణీంద్ర నాద్, వర్ధమాన రవిశంకర్, శ్రీదేవి, ఉషామాధవి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన

పాలకొల్లు సెంట్రల్: ఓటు హక్కు కలిగిన ఓటరు ఈవీఎంల ద్వారా ఓటు ఎలా వేయాలో అవగాహన కల్పిస్తున్నామని మునిసిపల్ సీనియర్ అసిస్టెంట్ పీఎస్ఎస్ఎస్ఆర్ ఆంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక వెలమగూడెం 9వ వార్డు సచివాలయంలో ఓటర్లకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పట్టణంలో ఉన్న 14 సచివాలయాల వార్డు ప్రజలకు ఈవీఎంలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ హారతి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

పెనుగొండ: ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని పెనుగొండ మండల తహసీల్దార్ ఎస్.గురుమూర్తి రెడ్డి అన్నారు. బుధవారం సిద్ధాంతంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస దొర, ఎంపీటీసీ సభ్యుడు చిన్నం ఏడుకొండలు, వీఆర్వో ఏసుబాబు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో గ్రామాభివృద్ధి

పెనుగొండ: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంతో వ్యవసాయ కార్మికులకు ఉపాధితో పాటు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం పెనుగొండ ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం మేట్లకు శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ సుండ్రం శ్రీనివాస దొర మాట్లాడుతూ ప్రతీ మేట్ ఉపాధి హామీ పనుల విధివిధానాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో తణుకు క్లస్టర్ ఏపీడీవీ వీరాస్వామి, మేట్స్ ట్రైనింగ్ కో ఆర్డినేటర్ శ్రీను, టీఏ శంకర్, సీఓ రామచంద్రరావు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర కిట్ల పంపిణీ

నరసాపురం: యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు రూపొందించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణంలోని 18,19 వార్డులకు సంబంధించి ఆడుదాం ఆంధ్ర క్రీడా కిట్‌లు పంపిణీ చేశారు. ఆయా వార్డులకు సంబందించిన యువకులకు క్రికెట్ కిట్స్, బాస్కట్‌బాల్ తదితర కిట్స్ అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, కౌన్సిలర్లు కేసరి గంగరాజు, గోరు సత్తిబాబు, కావలి నాని పాల్గొన్నారు.

టెన్త్ మోడల్ ప్రశ్నా పత్రాల అందజేత

యలమంచిలి: విద్యార్థులు చదువు నేర్చుకోవడంతో పాటు సమాజ స్థితిగతులను అధ్యయనం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బొర్రా గోపిమూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని మట్లపాలెం, గుంపర్రు, ఇలపకుర్రు గ్రామాల్లోని జెడ్పీహైస్కూలులో ఆయన సౌజన్యంతో ముద్రించిన 10వ తరగతి మోడల్ ప్రశ్నాపత్రాలను బుధవారం విద్యార్థులకు అందజేశారు. హెచ్‌ఎం టీబీ పద్మినికుమారి, కట్టుకాలువ సర్పంచ్ పొన్నమండ నాగరాజు, పోలిశెట్టి క్రాంతికుమార్ పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరాల నిర్వహణ

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా తూర్పుపాలెంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం రక్త దాన శిభిరం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా నియోజక వర్గ కన్వీనరు పోతుమూడి రామచంద్రరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలా రెడ్డిలు పాల్గొంటారన్నారు. కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గురువారం దొడ్డిపట్ల రోడ్డు వై జంక్షన్ వద్ద ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేయనున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) తెలిపారు. రక్తదాన శిబిరంతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

క్రీస్తు మార్గంలో పయనించాలి

పెనుగొండ: ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ కోరారు. కొడమంచిలి మార్కెట్ సెంటర్‌లో పాస్టర్ బి.డేవిడ్‌రాజు ఆధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు యల్లమెల్లి బేబీ రాజేష్, పోలిశెట్టి వనమరాజు, పాస్టర్ తిమోతి రాజు పాల్గొన్నారు. అలాగే కొడమంచిలి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఆచంట సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకరసీతారామ్, హెచ్‌ఎం ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

పదవులు బాధ్యతగా నిర్వహించాలి

నరసాపురం: పార్టీ అప్పగించిన పదవులను బాధ్యతగా నిర్వహించి పార్టీ పటిష్టతకు పాటుపడాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. వైఎస్సార్ సీపీ యూత్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన చదలవాడ మెర్లిన్ బుధవారం మర్యాదపూర్వకంగా ముదునూరిని ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కడలి రాంబాబు, వల్లభూని శేఖర్, చెరుకూరి ప్రసాదరాజు పాల్గొన్నారు.

రామనామ జపయజ్ఞం

పెనుమంట్ర: నెగ్గిపూడి శివాలయ ఆవరణలో ఉన్న శ్రీకోదండరాముని ఆలయంలో అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షింతలకు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. బుధవారం హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యురాలు గుడిమెట్ల రమారత్నం ఆధ్వర్యంలో శ్రీరామనామ జపం భజనలు చేశారు.